156 ఫిక్స్‌డ్ డోస్ మందులపై నిషేధం

న్యూఢిల్లీ : 156 ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్ (ఎఫ్‌డీసీ) మందులపై కేంద్రం నిషేధం విధించింది. జ్వరం, జలుబు, అలెర్జీలు, నొప్పుల కోసం ఉపయోగించే యాంటీబ్యాక్టీరియల్ మందులు కూడా ఈ జాబితాలో ఉన్నాయి. వీటి వల్ల హాని జరిగే అవకాశం ఉన్నట్లు తెలిపింది. సురక్షితమైన ప్రత్యామ్నాయ మందులు అందుబాటులో ఉన్నట్లు తెలిపింది. దీనికి సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్‌ను కేంద్రం ఈ నెల 12న జారీ చేసింది. రెండు లేదా మూడు క్రియాశీలక ఔషధ పదార్థాలు నిర్దిష్ట నిష్పత్తిలో ఉండే మందులను ఎఫ్‌డీసీ మందులు అంటారు. వీటిని కాక్‌టెయిల్ డ్రగ్స్ అని కూడా పిలుస్తారు. నొప్పుల నుంచి ఉపశమనం కోసం ఉపయోగించే అసెక్లోఫెనాక్ 50 ఎంజీ+పారాసిటమాల్ 125 ఎంజీ ట్యాబ్లెట్ కాంబినేషన్ కూడా నిషేధానికి గురైన ఎఫ్‌డీసీ మందుల జాబితాలో ఉంది. కేంద్ర ప్రభుత్వం నియమించిన నిపుణుల కమిటీ ఈ ఎఫ్‌డీసీలను అధ్యయనం చేసి, ఇవి అహేతుకమైనవని చెప్పిందని ఈ నోటిఫికేషన్ పేర్కొంది.

సెప్టెంబర్ 1 నుంచి ఆ మెసేజ్‌లను నిషేధించండి

టెలికం కంపెనీలకు ట్రాయ్ ఆదేశం

న్యూఢిల్లీ, ఆగస్టు 22: టెలికాం కంపెనీలకు భారత టెలికం నియంత్రణ సంస్థ ట్రాయ్ పలు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఇక నుంచి వినియోగదారులకు ఏపీకే ఫైల్స్, యూఆర్ఎల్‌లు, ఓటీటీ లింక్‌లు, బ్లాక్ లిస్టులో ఉన్న కాల్‌బ్యాక్ నెంబర్లతో కూడిన మెసేజ్‌లను పంపరాదని ఆదేశించింది. ఈ ఏడాది సెప్టెంబర్ 1 నుంచి ఈ ఆదేశాలు అమలులోకి వస్తాయని తెలిపింది. కొంతమంది మోసగాళ్ల బారి నుంచి వినియోగదారుల రక్షణ, స్వచ్ఛమైన మెసేజింగ్ విధానం కోసం ఈ ఆదేశాలు జారీ చేసినట్టు ట్రాయ్ తెలిపింది. అలాగే టెలీమార్కెటింగ్ కాల్స్‌కు సంబంధించి ట్రాయ్ కొన్ని మార్గదర్శకాలు విడుదల చేసింది. సెప్టెంబర్ 30 నుంచి అన్ని టెలీ మార్కెటింగ్ కాల్స్‌కు సంబంధించిన నెంబర్లు విధిగా '30 140'తో ప్రారంభం కావాలి. కాగా, రిజిస్టర్ కాకుండా స్పామ్ కాల్స్ చేస్తున్న టెలీమార్కెటీర్ల నెంబర్లను రెండేండ్ల పాటు బ్లాక్ లిస్టులో పెట్టాలని గత వారం ట్రాయ్ టెలికం కంపెనీలకు ఆదేశాలు ఇచ్చింది.

నటుడు విజయ్ పార్టీ జెండా ఆవిష్కరణ

చెన్నై: తమిళ సినీ నటుడు విజయ్ ఏర్పాటు చేసిన రాజకీయ పార్టీ తమిళగ వేట్రి కళగం (టీవీకే) జెండాను గురువారం ఆవిష్కరించారు. పనైయూర్‌లోని పార్టీ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. జెండా పైన, కింద జేగురు (మెరూన్) రంగు, మధ్యలో పసుపు రంగు ఉన్నాయి. మధ్యలో రెండు ఏనుగులు, వాటి మధ్యలో వాగాయ్ పువ్వు ఉంది. వాగాయ్ అంటే తమిళంలో విజయం అని అర్థం. విజయ్ మాట్లాడుతూ, టీవీకే పార్టీ జెండా వెనుక చారిత్రక ప్రాధాన్యం ఉందని, రాష్ట్ర స్థాయి సమావేశంలో దాని గురించి వివరిస్తానని చెప్పారు. తాను దీనిని జెండాగా భావించడం లేదని, తమిళనాడు భావి తరాల విజయకేతనంగా భావిస్తున్నానని తెలిపారు. విజయ్ పార్టీతో తమిళ రాజకీయాల్లో నూతన అధ్యాయం ప్రారంభమైంది. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు 2026లో జరుగుతాయి.

రాజకీయం చేయకండి

- కోల్‌కతా హత్యాచార ఘటనపై కేంద్రం, బెంగాల్ సర్కారుకు సుప్రీంకోర్టు స్పష్టీకరణ
- దర్యాప్తు పురోగతిపై నివేదిక ఇచ్చిన సీబీఐ
- ఎఫ్ఐఆర్‌కు ముందే పోస్టుమార్టమా?
- క్రైమ్‌సీన్‌ను భద్రపర్చడంలో నిర్లక్ష్యం
- ఎఫ్ఐఆర్ నమోదుకు 14 గంటలా?
- బెంగాల్ ప్రభుత్వానికి సుప్రీం ప్రశ్నలు
- నా 30 ఏండ్ల వృత్తి జీవితంలో ఇలాంటి ప్రక్రియ చూడలేదు: జస్టిస్ పార్దివాలా

న్యూఢిల్లీ, ఆగస్టు 22: కోల్‌కతా ట్రైనీ డాక్టర్ హత్యాచార ఘటనను రాజకీయం చేయొద్దని కేంద్రం, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాల తరపు న్యాయవాదులకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ సూచించారు. గురువారం కోల్‌కతా ఘటనపై జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. ఈ సందర్భంగా కేంద్రం తరపున హాజరైన సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం తరపు న్యాయవాది కపిల్ సిబల్ మధ్య తీవ్రస్థాయిలో వాదనలు జరిగాయి. రెచ్చగొట్టే ప్రకటనలు చేయకుండా కోర్టు చర్యలు తీసుకోవాలని కపిల్ సిబల్ కోరగా తుషార్ మెహతా స్పందిస్తూ..'పశ్చిమ బెంగాల్ మంత్రి ప్రకటనమా దగ్గర ఉంది. వారి లీడర్‌కు వ్యతిరేకంగా ఎవరైనా మాట్లాడితే వేళ్లు నరికేస్తామని చెప్పారు.' అని వ్యాఖ్యానించారు. దీనికి కపిల్ సిబల్ బదులిస్తూ.. 'నేను కూడా బెంగాల్ ప్రతిపక్ష నేత ప్రకటన చదువుతా. బుల్లెట్లు పేలుతాయని సువేందు అధికారి అన్నారు' అని పేర్కొన్నారు. దీంతో అసంతృప్తి వ్యక్తం చేసిన చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్.. 'దయచేసి దీనిని రాజకీయం చేయకండి. వేగవంతమైన, సమర్థమైన విచారణ తర్వాత చట్టం తన పని తాను చేస్తుంది' అని వ్యాఖ్యానించారు. కాగా, వాదనల సందర్భంగా కపిల్ సిబల్ నవ్వారని ఆరోపిస్తూ తుషార్ మెహతా ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

కోల్‌కతా వైద్య విద్యార్థిని మృతి కేసును విచారణ చేస్తున్న సుప్రీం కోర్టు ధర్మాసనం

క్రైమ్ సీన్‌ను మార్చేశారు: సీబీఐ

హత్యాచార ఘటనపై విచారణ జరుపుతున్న సీబీఐ గురువారం ఉదయం దర్యాప్తు పురోగతిపై సుప్రీంకోర్టుకు నివేదిక సమర్పించింది. ఘటన జరిగిన ఐదో రోజున సీబీఐ దర్యాప్తు బాధ్యతను తీసుకుందని, అప్పటికే క్రైమ్ సీన్‌ను మార్చేసినట్టు సీబీఐ తరపున తుషార్ మెహతా పేర్కొన్నారు. బాధితురాలి తండ్రి ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని పట్టుబట్టినా వినలేదని, అంత్యక్రియలు పూర్తైన తర్వాత రాత్రి 11.45కు ఎఫ్ఐఆర్ నమోదు చేశారని తెలిపారు. ఇది నేరాన్ని కప్పిపెట్టే ప్రయత్నమే అని అన్నారు. మృతురాలి కుటుంబాన్ని తప్పుదోవ పట్టించారని, వారి కూతురు ఆత్మహత్య చేసుకుందని బెంగాల్ పోలీసులు చెప్పారని తెలిపారు. అయితే, అంతా వీడియో తీశారని, క్రైమ్ సీన్ ఏమీ మార్చలేదని కపిల్ సిబల్ పేర్కొన్నారు. కాగా, ఈ ఘటనలో ఆర్జీ కార్ వైద్య కళాశాల మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్, మరో నలుగురు వైద్యులకు పాలిగ్రాఫ్ పరీక్ష నిర్వహించేందుకు సీబీఐకి ప్రత్యేక కోర్టు అనుమతించింది.

కేసు నమోదుకు ముందే పోస్టుమార్టమా?: సుప్రీం

ట్రైనీ డాక్టర్‌ది అసహజ మరణమని కేసు నమోదు చేయడానికి ముందే పోస్టుమార్టం జరిపేయడం తీవ్రంగా కలవరపరుస్తున్నదని జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రా వ్యాఖ్యానించారు. ఈ ఘటనను మొదటిసారి నమోదు చేసిన పోలీస్ అధికారి విచారణకు రావాలని ధర్మాసనం ఆదేశించింది. ఘటన జరిగినట్టు ఉదయం 10.10 గంటలకు జనరల్ డైరీలో నమోదైతే క్రైమ్ సీన్‌ను భద్రపర్చడం, ఆధారాలను సీజ్ చేయడం వంటివి రాత్రి 11.30కు చేయడం తీవ్రమైన విషయమని కోర్టు వ్యాఖ్యానించింది. 'ఈ కేసులో మీ రాష్ట్రం(బెంగాల్) పాటించిన మొత్తం ప్రక్రియను నా 30 ఏండ్ల వృత్తి జీవితంలో ఎన్నడూ చూడలేదు' అని కపిల్ సిబల్‌ను ఉద్దేశించి జస్టిస్ పార్దివాలా వ్యాఖ్యానించారు. ఘటన జరిగిన తరువాత ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి ఎందుకు 14 గంటల సమయం పట్టిందని కపిల్ సిబల్‌ను సీజేఐ ప్రశ్నించారు.

వైద్యుల భద్రతకు వెంటనే చర్యలు తీసుకోండి

దేశవ్యాప్తంగా వైద్యుల భద్రత కోసం కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు సత్వరమే చర్యలు తీసుకోవాలని కోర్టు ఆదేశించింది. కేంద్ర వైద్య శాఖ కార్యదర్శి వారం లోగా అన్ని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, డీజీపీలతో మాట్లాడి వైద్యుల భద్రతకు భరోసా కల్పించాలని సూచించింది. తాము ఏర్పాటుచేసిన జాతీయ టాస్క్‌ఫోర్స్ అందరి సూచనలు తీసుకొని వైద్యుల భద్రత కోసం ఒక జాతీయ ప్రొటోకాల్‌ను రూపొందిస్తుందని పేర్కొన్నది.

ధర్నా చేస్తూనే కోర్టు విచారణను వీక్షిస్తున్న ఆర్‌జీ కర్ దవాఖానవైద్యులు

శాంతియుత నిరసనలను అడ్డుకోవద్దు

- పశ్చిమ బెంగాల్ ప్రభుత్వానికి సుప్రీం ఆదేశం
- వెంటనే విధుల్లో చేరాలని వైద్యులకు సూచన
- సమ్మె విరమిస్తున్నట్టు వైద్య సంఘాల ప్రకటన

న్యూఢిల్లీ, ఆగస్టు 22: శాంతియుతంగా చేసే నిరసనలను అడ్డుకోవద్దని, అంతరాయం కలిగించొద్దని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. కోల్‌కతా హత్యాచార ఘటనను గురువారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. 'శాంతియుత నిరసనలను అడ్డుకోవద్దని, అంతరాయం కలిగించొద్దని మరోసారి స్పష్టం చేస్తున్నాం. ఈ ఘటనకు వ్యతిరేకంగా శాంతియుతంగా నిరసనలు తెలుపుతున్న వారిపై రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవద్దు' అని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ తరపు న్యాయవాది కపిల్ సిబల్‌తో ధర్మాసనం పేర్కొన్నది. నిరసనలు తెలియజేస్తున్న వైద్యులు, విద్యార్థులకు ఆబ్సెంట్ వేస్తున్నారని, పరీక్షలు రాయనివ్వడం లేదని ఎయిమ్స్ నాగ్‌పూర్ వైద్యుల తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. అయితే, విధులకు రాకపోయినా, హాజరైనట్టు నమోదు చేయమని తాము ఆదేశించలేమని కోర్టు పేర్కొన్నది.

న్యాయం, వైద్యం ఆగిపోవద్దు

న్యాయం, వైద్యం ఆగిపోవడానికి వీలు లేదని, వైద్యులు వెంటనే విధుల్లోకి చేరాలని కోర్టు సూచించింది. విధుల్లోకి చేరిన వైద్యులు, సిబ్బందిపై నిరసనల్లో పాల్గొన్నందుకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోరాదని స్పష్టం చేసింది.

సమ్మె విరమించిన వైద్యులు

కోల్‌కతా ఘటనకు నిరసనగా 11 రోజులుగా కొనసాగుతున్న సమ్మెను వైద్యులు విరమించారు. సుప్రీంకోర్టు సూచనల మేరకు సమ్మె విరమిస్తున్నట్టు ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా మెడికల్ అసోసియేషన్ గురువారం ప్రకటించింది. ఢిల్లీ ఎయిమ్స్, ఆర్ఎంఎల్ వైద్యులు సైతం సమ్మె విరమించి విధుల్లో చేరుతున్నట్టు ప్రకటించారు. ట్రైనీ డాక్టర్ హత్యాచార ఘటనను నిరసిస్తూ ఆగస్టు 12 నుంచి దేశవ్యాప్తంగా వైద్యులు సమ్మె ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఎమర్జెన్సీ సేవలకు మాత్రం వైద్యులు హాజరయ్యారు. కాగా, పశ్చిమ బెంగాల్ జూనియర్ డాక్టర్స్ ఫ్రంట్ మాత్రం సమ్మెను కొనసాగిస్తామని చెప్పింది.

నిందితుడిలో కనిపించని పశ్చాత్తాపం

కోల్‌కతా: ఆర్‌జీ కర్ దవాఖానలో ట్రైనీ డాక్టర్ (31) హత్యాచారం కేసులో ప్రధాన నిందితుడు సంజయ్ రాయ్ (33) పశు ప్రవృత్తి కలవాడని, అశ్లీలతకు బానిస అని కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) వర్గాలు తెలిపాయి. సంజయ్ మానసిక స్థితిని సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీకి చెందిన వైద్య బృందం విశ్లేషించినపుడు ఈ విషయం తెలిసింది. నిందితుడు పశ్చాత్తాపం వ్యక్తం చేయడం లేదని, జరిగిన ప్రతి విషయాన్నీ గుక్కతిప్పుకోకుండా వివరించాడని సీబీఐ వర్గాలు తెలిపాయి. నేరం జరిగిన ప్రదేశంలో సంజయ్ ఉన్నట్లు తెలిపే సాంకేతిక, శాస్త్రీయ ఆధారాలు ఉన్నాయని చెప్పాయి. ఈ కేసు దర్యాప్తును కలకత్తా హైకోర్టు సీబీఐకి అప్పగించిన సంగతి తెలిసిందే.

దేశంలో రోజుకు 90 రేప్ కేసులు

అత్యాచార నేరాలపై కఠిన చట్టాలు చేయాలి.. మోదీకి మమత లేఖ

కోల్‌కతా, ఆగస్టు 22: కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ దవాఖానలో హత్యాచార ఘటనతో దేశం అట్టుడుకుతున్న క్రమంలో బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రధాని నరేంద్ర మోదీకి గురువారం లేఖ రాశారు. అత్యాచార నేరాలలో నేరస్తులకు తీవ్రమైన శిక్షను విధించేలా కేంద్రం కఠిన చట్టాలను చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా ఈ కేసుల విచారణ త్వరితగతిన పూర్తిచేసి బాధితులకు న్యాయం చేయడానికి ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని ఆమె కోరారు. సీఎం ప్రధాన సలహాదారు అలపన్ బందోపాధ్యాయ గురువారం ఆ లేఖను మీడియాకు చదివి వినిపించారు. దేశంలో రోజుకు దాదాపు 90 లైంగిక దాడి కేసులు నమోదవుతున్నాయని, అందులో చాలామంది బాధితులు హత్యకు గురవుతున్నారని మమత తన లేఖలో పేర్కొన్నారు. ఇలాంటి నేరాలకు పాల్పడే వారికి కఠిన శిక్షలు విధించేలా కేంద్రం చట్టంలో మార్పులు చేయాలని కోరారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసి విచారణ 15 రోజుల్లో ముగించాలని ఆమె ప్రధానికి విజ్ఞప్తి చేశారు.

బడిలోనే రక్షణ లేకపోతే విద్యాహక్కుకు అర్థమే లేదు

బద్లాపూర్ కేసును సుమోటోగా స్వీకరించిన బాంబే హైకోర్టు

ముంబై: మహారాష్ట్రలోని బద్లాపూర్‌లో పసిపిల్లలపై ఓ పాఠశాల స్వీపర్ లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటనను బాంబే హైకోర్టు సుమోటోగా విచారణకు స్వీకరించింది. పిల్లలకు పాఠశాలలు సురక్షితం కాకపోతే.. ఇక విద్యాహక్కు గురించి మాట్లాడటంలో అర్థం లేదని పేర్కొన్నది. ఈ కేసులో పోలీసుల తీరును తీవ్రంగా తప్పుబట్టింది. ప్రజాగ్రహం తీవ్ర స్థాయిలో వ్యక్తం కాకపోతే, అధికార యంత్రాంగం కదలడం లేదని దుయ్యబట్టింది. ఇద్దరు బాలికలపై లైంగిక దాడి ఘటన అమానుషమైనది మాత్రమే కాకుండా, అందరినీ దిగ్భ్రాంతికి గురి చేసిందని పేర్కొంది. బద్లాపూర్ పోలీసులు నిర్వహిస్తున్న ఒరిజినల్ కేస్ డైరీ, ఎఫ్ఐఆర్ నకలు, ఈ కేసుకు సంబంధించిన ఇతర పత్రాలను ఈ నెల 27న సమర్పించాలని సిట్‌ను ఆదేశించింది. ముంబై సమీపంలోని బద్లాపూర్‌లోని ఓ పాఠశాలలో ఇద్దరు బాలికలపై లైంగిక దాడి జరిగినట్లు కేసు నమోదైన విషయం తెలిసిందే. 3-4 ఏళ్ల వయసుగల ఈ ఇద్దరిపైనా అదే పాఠశాలలో పని చేస్తున్న పురుష అటెండెంట్ లైంగిక దాడి చేసినట్లు తెలియడంతో పెద్ద ఎత్తున ప్రజాగ్రహం వ్యక్తమైంది. ఈ నెల 12, 13 తేదీల్లో ఈ దారుణం జరిగినప్పటికీ పోలీసులు ఈ నెల 16న కేసు నమోదు చేశారు.

బెంగళూరులో నల్లా బిల్లుల మోత!

- పరోక్షంగా చెప్పిన డిప్యూటీ సీఎం డీకే
- వాటర్ బోర్డు నష్టాల్లో ఉందని ప్రకటన

బెంగళూరు, ఆగస్టు 22: కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో సామాన్య ప్రజలపై మరో భారం పడనుంది. బెంగళూరులో నల్లా బిల్లులు పెంచాలని సిద్ధరామయ్య సర్కారు భావిస్తున్నది. ఈ విషయాన్ని ఉప ముఖ్యమంత్రి, బెంగళూరు అభివృద్ధి శాఖ మంత్రి డీకే శివకుమార్ పరోక్షంగా వెల్లడించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'నల్లా బిల్లులు పెంచాలనే ప్రతిపాదన ఏడెనిమిది ఏండ్ల నుంచి ఉంది. వాటర్ బోర్డు(బీడబ్ల్యూఎస్ఎస్‌బీ) నష్టాలతో నడుస్తున్నది. కరెంటు బిల్లులు కట్టడానికి కూడా పైసలు లేవు. పనులు ఎలా చేయాలి? వేరే మార్గం లేదు. క్యాబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటాం' అని పేర్కొన్నారు. కాగా, ఇప్పటికే కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం వరుసగా ప్రజలపై ఏదో ఓ భారం వేస్తూ వస్తున్నది. రెండు నెలల క్రితమే కర్ణాటక మిల్క్ ఫెడరేషన్(కేఎంఎఫ్) పాల ధరలను లీటరుకు రూ.2 పెంచింది. ఏడాదిలో ధరలు పెంచడం ఇది రెండోసారి. ఆ తర్వాత పెట్రోధరలపై సేల్స్ ట్యాక్స్‌ను పెంచింది. దీంతో పెట్రోల్ ధర రూ.3, డీజిల్ ధర రూ.3.02 పెరిగింది. ఇప్పుడు బెంగళూరు వాసుల నల్లా బిల్లులు పెంచేందుకు సిద్ధమైంది.

అక్రమాస్తుల కేసులో డీకేను ప్రశ్నించిన లోకాయుక్త

అక్రమాస్తుల కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న డీకే శివకుమార్ గురువారం లోకాయుక్త పోలీస్ ముంగిట హాజరయ్యారు. కేసుకు సంబంధించి మూడు గంటల పాటు ఆయన్ని లోకాయుక్త అధికారులు ప్రశ్నించినట్టు తెలిసింది. రాష్ట్ర మంత్రిగా డీకే 2013-18 మధ్య పెద్ద ఎత్తున అక్రమాస్తులు ఆర్జించారని సీబీఐ 2020 సెప్టెంబర్‌లో ఎఫ్ఐఆర్ నమోదుచేసింది. అయితే కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలో వచ్చాక, కేసును సీబీఐ నుంచి లోకాయుక్తకు బదిలీ చేసింది. సీబీఐ విచారణను నిరాకరించింది. అయినప్పటికీ కేసు దర్యాప్తు సీబీఐ ఆపటం లేదని డీకే శివకుమార్ మండిపడ్డారు. 'సీబీఐ ఈ కేసును విచారించటం ఆపాలి. కానీ అలా చేయటం లేదు. నన్ను, నా వాళ్లను సీబీఐ వేధిస్తున్నది. నాకు సమన్లు ఇవ్వకుండా, నన్ను విచారణ చేయకుండా, నా బంధువులు, స్నేహితుల్ని వేధిస్తున్నది. లోకాయుక్త కూడా అదే చేస్తున్నది' అని డీకే అన్నారు.

మాన్యువల్ ప్రకారమే నడుస్తుంది

కాంగ్రెస్.. అధికారం చేపట్టిన తర్వాత ఆయా గ్యారెంటీలకు ఆంక్షలు, కోతలతో ఎగనామం పెడుతున్నది. 'ఉచిత విద్యుత్తు' అంటూ ఊదరగొట్టి ఛార్జీల పెంపునకు తెరతీశారని, మహిళలకు ఆర్థిక భరోసా ఇస్తామన్న 'గృహలక్ష్మి' స్కీమ్‌కు కొత్త ఆంక్షలు జోడించారని, ఆడబిడ్డలకు ఉచిత బస్సు సర్వీసులంటూ ఊరించిన 'శక్తి' స్కీమ్‌లో వయసు, వృత్తి అంటూ కొత్త పరిమితులు తెచ్చారని, నిరుద్యోగులకు భృతి కల్పిస్తామన్న 'యువనిధి', పేదలకు ఉచిత బియ్యమన్న 'అన్నభాగ్య' ఇలా ప్రతీ స్కీమ్‌లోనూ కోతలు విధిస్తున్నారని ప్రజలు ఆగ్రహంతో రగిలిపోతున్నారు.

అవసరమనుకుంటే ఆ లేఖపై విచారణ.. ముడా స్కామ్‌పై కర్ణాటక హోంమంత్రి

సీఎం సిద్ధరామయ్య భార్య బీఎం పార్వతి 2014లో 'మైసూర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ' (ముడా)కి రాసిన లేఖను ట్యాంపరింగ్ చేశారని, అందులోని కొన్ని వ్యాఖ్యల్ని వైట్‌నర్‌తో చెరిపివేశారన్న ఆరోపణలు రాజకీయంగా దుమారం రేపుతున్నాయి. ప్రతిపక్షాల ఆరోపణలపై అవసరమనుకుంటే, సిట్ లేదా దర్యాప్తు సంస్థ దృష్టిసారిస్తుందని కర్ణాటక హోంమంత్రి పరమేశ్వర చెప్పారు. అత్యంత ఖరీదైన విద్యానగర్ లే-అవుట్‌లో తనకు భూమి ఇవ్వాలని బీఎం పార్వతి ఆ లేఖలో కోరారు. అయితే, దీనిని వైట్‌నర్‌తో ఉద్దేశపూర్వకంగా కొట్టివేశారు. ముడా కుంభకోణం బయటపడ్డాకనే ఆధారాలు చెరిపేయాలనే లక్ష్యంతోనే ఇలా కొట్టేశారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గురువారం హోంమంత్రి మీడియాతో మాట్లాడుతూ, 'ప్రతిపక్షాలు చేసిన ఆరోపణలేంటో నాకు తెలియదు. కానీ, సీఎం భార్య రాసిన లేఖలోని అంశాలపై అవసరమనుకుంటే దర్యాప్తు సంస్థ దృష్టి సారిస్తుంది' అని చెప్పారు.

అమెరికాలో వ్యభిచారం కేసులో

తెలుగు వ్యక్తుల అరెస్ట్

టెక్సాస్ : అమెరికాలోని టెక్సాస్‌లో వ్యభిచారం కేసులో తెలుగువారు అరెస్టయ్యారు. వ్యభిచారాన్ని నిరోధించే లక్ష్యంతో టెక్సాస్‌లోని డెంటాన్ కౌంటీ పోలీసులు ఈ నెల 14, 15 తేదీల్లో జరిపిన దాడుల్లో లైంగిక సేవలను పొందడానికి వచ్చిన 21 మందిని అరెస్ట్ చేశారు. అందులో భారత్‌కు చెందిన ఏడుగురు విటులు కూడా ఉన్నట్టు డెంటాన్ కౌంటీ షరీఫ్ కార్యాలయం తెలిపింది. అరెస్టయిన వారిలో నిఖిల్ కుమ్మరి, గల్లా మోనిష్, కార్తీక్ రాయపాటి, నబీన్ శ్రేష్ఠ, అమిత్ కుమార్, జైకిరణ్ రెడ్డి మేకల ఉన్నారు. డెంటాన్ వాసులైన నిఖిల్ బండి, నిఖిల్ కుమార్‌లు అరెస్ట్ నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నించారన్న ఆరోపణలపై అభియోగాలు నమోదు చేసినట్టు చెప్పారు. మిగిలిన ఐదుగురు విటులు లైంగిక సేవలు పొందడానికి రాగా, అరెస్ట్ చేశామన్నారు. వారిలో జైకిరణ్‌పై 18 ఏండ్లలోపు మైనర్‌తో వ్యభిచారానికి ప్రయత్నించినట్టు అదనపు అభియోగాలు నమోదు చేశారు.

టెక్సాస్‌లో 90 అడుగుల హనుమాన్ విగ్రహం

హ్యూస్టన్: అమెరికాలోని టెక్సాస్‌లో 90 అడుగుల ఎత్తైన హనుమంతుడి కాంస్య విగ్రహం ఏర్పాటైంది. ఇది అగ్రరాజ్యంలోనే మూడో అతిపెద్దది. దీనికి 'స్టాట్యూ ఆఫ్ యూనియన్' (ఐక్యతా విగ్రహం) అని పేరు పెట్టారు. ప్రపంచంలోని అత్యంత ఎత్తైన విగ్రహాల్లో ఒకటైన ఇది.. భారతదేశం వెలుపల ఉన్న అత్యంత ఎత్తైన ఆంజనేయుడి విగ్రహంగానూ రికార్డులకెక్కింది. టెక్సాస్‌లోనే అత్యంత ఎత్తైన విగ్రహంగా మరో రికార్డు కూడా సొంతం చేసుకుంది. సుగర్ ల్యాండ్‌లోని శ్రీ అష్టలక్ష్మి ఆలయంలో చినజీయర్ స్వామి ఈ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఇందులో భాగంగా ఈ నెల 15 నుంచి 18 వరకు ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నిస్వార్థం, భక్తి, ఐక్యతకు గుర్తుగా ఈ విగ్రహాన్ని నిర్వాహకులు అభివర్ణించారు.

రైతు సమస్యల పరిష్కారానికి త్వరలో కమిటీ

సుప్రీంకోర్టు వెల్లడి

న్యూఢిల్లీ, ఆగస్టు 22: దేశంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి త్వరలో కొందరు సభ్యులతో ఒక కమిటీని వేయనున్నట్టు సుప్రీం కోర్టు గురువారం తెలిపింది. రైతులకు సంబంధించిన తాత్కాలిక సమస్యలను ఈ కమిటీకి తెలియజేయాలని పంజాబ్, హర్యానా రాష్ట్రాలను ఆదేశించిన జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం కేసును సెప్టెంబర్ 2వ తేదీకి వాయిదా వేసింది. తమ డిమాండ్ల సాధన కోసం ఫిబ్రవరి 13 నుంచి ఆందోళన చేస్తున్న రైతులను కలిసి హైవేపై నిలిపి ఉంచిన ట్రాక్టర్లు, ట్రాలీలను తొలగించేందుకు ఒప్పించాలని పంజాబ్, హర్యానా రాష్ట్రాలకు సూచించింది. రైతుల నిరసనలను నిరోధించడానికి శంభు సరిహద్దు వద్ద అంబాలలో హర్యానా ప్రభుత్వం ఏర్పాటు చేసిన బారికేడ్లను వారం రోజుల్లో తొలగించాలంటూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది.

ఒళ్లంతా పచ్చబొట్లతో గిన్నిస్ రికార్డ్

లండన్, ఆగస్టు 22: అత్యధిక పచ్చ బొట్లు కలిగిన వ్యక్తిగా అమెరికా మహిళ ఎస్పరెన్స్ లుమినెస్కా ఫ్యూయెర్‌జినా(36) గిన్నిస్ రికార్డ్ సృష్టించారు. 99.98 శాతం శరీరాన్ని ఆమె పచ్చబొట్లతో నింపేశారు. 'చీకటిని అందంగా మార్చడం' అనే ఇతివృత్తంతో తన దేహాన్ని కాన్వాస్‌గా మార్చుకున్నారు. బ్రిడ్జ్‌పోర్ట్‌కు చెందిన ఈ మాజీ ఆర్మీ ఉద్యోగిని అందమైన డిజైన్ల పచ్చబొట్లతో శరీరాన్ని నింపేశారు. గిన్నిస్ రికార్డ్ కలిగిన వారిని ప్రశంసిస్తూ పెరిగిన ఆమె తనకు రికార్డ్ దక్కడంపై కృతజ్ఞతలు తెలిపారు. మహిళల శక్తి సామర్థ్యాలను ప్రదర్శించడానికి పచ్చబొట్ల రికార్డ్‌తో ప్రయత్నించానని చెప్పారు.

2,492 క్యారెట్ల భారీ వజ్రం

బోట్స్‌వానా గనిలో లభ్యం.. గత వందేండ్లలో అతిపెద్దది

*న్యూఢిల్లీ : బోట్స్‌వానాలోని సుప్రసిద్ధ వజ్రాల గని కరోవేలో భారీ వజ్రం దొరికింది. దీని బరువు 2,492 క్యారెట్లు అని ఆ దేశ ప్రభుత్వం తెలిపింది. దీనిని ఎక్స్-రే టెక్నాలజీ సహాయంతో గుర్తించినట్లు కెనడియన్ మైనింగ్ కంపెనీ లుకారా డైమండ్ కార్పొరేషన్ తెలిపింది. ఇది అత్యధిక నాణ్యత కలిగిన వజ్రం అని వివరించింది. దక్షిణాఫ్రికాలో 1905లో 3,106 క్యారెట్ల కలినన్ వజ్రం దొరికిందని, ఆ తర్వాత దొరికిన అతి పెద్ద వజ్రం ఇదేనని పేర్కొంది. కలినన్ వజ్రాన్ని జెమ్స్‌గా ముక్కలు చేశారని, వీటిలో కొన్ని జెమ్స్ బ్రిటిష్ క్రౌన్ ఆభరణాల్లో ఉన్నాయని తెలిపింది. వజ్రాలు అధికంగా దొరికే దేశాల్లో బోట్స్‌వానా రెండోది. ఇటీవలి సంవత్సరాల్లో ప్రపంచంలోని అతి పెద్ద వజ్రాలన్నీ ఇక్కడ దొరికినవే కావడం విశేషం. కరోవే గనిలో 2019లో దొరికిన 1,758 క్యారట్ల సెవెలో వజ్రం ఇప్పటి వరకు రెండో అతి పెద్ద వజ్రంగా రికార్డుల్లో ఉండేది. దీనిని ఫ్రెంచ్ ఫ్యాష